## క్లుప్తంగా

### రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



ఏటూరునాగారం : ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర కోకన్వీనర్ చంద రఘుపతిరావు, కోరగట్ల లక్ష్మణ్‌రావు, కుంజ నారాయణలు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం కొమురం భీం విగ్రహం ఎదుట ఏప్రిల్ 12 నుంచి 14వ తేదీ వరకు జరిగే రాష్ట్ర మహాసభల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వంక నరేష్, గొంది వీరయ్య, లింగమూర్తి, రమేష్, రాజు పాల్గొన్నారు.

### యంత్ర పరికరాలకు దరఖాస్తు చేసుకోండి

వాజేడు/కన్నాయిగూడెం :ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ శా ఖ ద్వారా అందించే యంత్ర పరికరాలకు రైతులు దరఖాస్తుల చేసుకోవాలని వ్యవసాయాధికారి ముంజ మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సబ్సిడీ వ్యవసాయ యంత్ర పరికరాల కో సం ఎస్సీ, ఎస్టీ రైతులతో పాటు జనరల్ మహిళా రైతులు మాత్రమే దరఖాస్తులను చేసుకో వాలన్నారు. ఒక పవర్ స్ప్రేయర్, ఒక బ్యాటరీ స్ప్రేయర్, ఒక కల్టివేటర్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జనరల్ రైతులకు 50 శాతం, ఎస్సీలకు 16, ఎస్టీలకు 9 శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందించాలని కోరారు. పూర్తి వివరాల కోసం వ్యవసా య శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

### నర్సరీల పరిశీలన



వాజేడు : మండలంలోని ప్రగళ్లపల్లి, ఎడ్జెర్లపల్లి గ్రామ పంచాయతీల్లోని నర్సరీలను ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు మంగళవారం పరిశీలించారు. మొక్కలకు సకాలంలో నీటిని అందించాలని, మొక్కలు అన్ని సక్రమంగా బతికేలా చూడాలని గ్రామకార్యదర్శులకు సూచించారు.

### కుష్ఠు వ్యాధిపై ఇంటింటి సర్వే



వాజేడు : జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగంగా మండలంలోని బొల్లారం, ఆరుగుంటపల్లి గ్రామాల్లో మంగళవారం వైద్యాధికారిని గ్యానస ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఈ సర్వే కొనసాగగా అనుమానితులను పరీక్షించారు. స్పర్శలేని మచ్చలు ఉన్న వారి వద్దకు డీపీఎంఓ సత్యనారాయణ వెళ్లి పర్యవేక్షించారు. మార్చి 30 వరకు ఈ సర్వే ఉదయం 9 గంటలలోపు జరుగుతుందని తెలిపారు. అనుమానితుల పేర్లను నమోదు చేసుకుని వైద్య పరీక్షలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. సర్వేలో కోటిరెడ్డి, శ్రీనివాసరావు, కన్యాకుమారి, రాజేశ్వరి, ఆశ కార్యకర్తలు ప్రసన్న, వినోద, కన్నమ్మ, కాంత, తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి ఎద్దడి రాకుండా చూస్తాం



వాజేడు : వేసవి కాలంలో మండలంలో తాగునీటి ఎద్దడి రాకుండా చూస్తామని ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు మంగళవారం అన్నారు. మండలంలోని ఎడ్జెర్లపల్లి కొత్తూరు గ్రామాల్లో గతంలో బోరు వేసి మోటారును బిగించారు. ఆ తర్వాత మోటారు మరమ్మతులకు గురికావడంతో ఎవరూ పట్టించుకోలేదు. వేసవిలో ఏదైనా కారణంతో మిషన్ భగీరథ నీరు అందకపోతే ఎడ్జెర్లపల్లి కొత్తూరు గ్రామస్తులకు తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉంది. దీంతో నిరుపయోగంగా ఉన్న బోరులో 5 హెచ్‌పీ మోటార్‌ను మరమ్మతు చేసి బిగించి నీటిని తోడి చూశారు. పని చేస్తుండటంతో మిషన్ భగీరథ నీరు రాని రోజు ఉపయోగించుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

# ప్రమాదాలకు దారి తీస్తున్న లారీలు

- అతివేగంగా వెళ్తున్న ఇసుక వాహనాలు
- రోడ్డు దాటాలంటే జంకుతున్న జనం



ఎదిర సమీపంలో వరుసగా వస్తున్న ఇసుక లారీలు

వెంకటాపురం(కె) : మండలంలో ఆలుబాక నుంచి వాజేడు మండలం జగన్నాథపురం గ్రామ సమీపం వరకు రోడ్డుపై ప్రయాణం చేయాలంటే జనం జంకుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి ఇసుక లారీలు వందలాదిగా వస్తున్నాయి. ఈ లారీలు వాజేడు మండలం మీదుగా హైదరాబాద్‌కు వెళ్తుంటాయి. రాత్రి, పగలు తేడా లేకుండా అతివేగంగా వెళ్తుండడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుందోనని వాహనదారులు, పాదచారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

**రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి**

మండలంలోని ఉప్పేడు–వీరాపురం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి వెనుక నుంచి ఇసుక లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వారం క్రితం వాజేడు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు వ్యక్తులు గాయపడ్డారు. వెంకటాపురం, వాజేడు మండలాల్లో ఇసుక లారీలతో పలు చోట్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కాగా వందల సంఖ్యలో వస్తున్న ఇసుక లారీలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**పగలు,రాత్రి తేడా లేకుండా దూసుకెళ్తున్నాయి**

వెంకటాపురం, వాజేడు మండలాల్లో రాత్రి, పగలు తేడా లేకుండా వందల సంఖ్యలో ఇసుక లారీలు అతి వేగంగా దూసుకెళ్తున్నాయి. వీటి వేగానికి సంబంధిత శాఖ అధికారులు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఒకేసారి పదుల సంఖ్యలో లారీలు దూసుకు వస్తుండటంతో వాహనదారులు, పాదచారులు రోడ్డు దాటేందుకు భయపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించి ఇసుక లారీలు మృత్యులారీలుగా మారకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు, కోరుతున్నారు.

# మొక్కజొన్న పంట ధ్వంసం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన కౌలు రైతు



రైతు నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

వెంకటాపురం(ఎం): మండలంలోని లింగాపూర్ శివారులో కౌలు రైతు ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని మొక్కజొన్న, ఫామాయిల్ పంటను సాగు చేస్తున్నాడు. సోమవారం రాత్రి కొంత మంది వ్యక్తులు డోజర్ ట్రాక్టర్లతో పంటను ధ్వంసం చేశారని ములుగు జిల్లా కేంద్రానికి చెందిన కౌలు రైతు ధరంసోతు దేవేందర్ మంగళవారం వెంకటాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను సాగు చేస్తున్న భూమి యజమానికి ఇతర వ్యక్తులకు భూతగాదా ఉందని, భూసమస్య పరిష్కరించుకోకుండా తాను సాగు చేస్తున్న పంటను ధ్వంసం చేయడంతో తీవ్రంగా నష్టపోయినట్లు బాధిత రైతు ఆరోపించారు. పంటను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని రైతు నుంచి వివరాలు సేకరించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఘనంగా ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్



ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మంగపేట : మండలంలోని రాజుపేట పీఎంశ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బానోతు బాలాజీ ఆధ్వర్యంలో ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమంలో భాగంగా హర్యానా కల్చరల్ ఈవెంట్ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమ ఇన్‌చార్జ్ కొత్తపల్లి పోషన్న పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు హర్యాన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా వేషధారణ, వంటకాలు, నృత్య ప్రదర్శనలు కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమం అనంతరం హెచ్ఎం మాట్లాడారు. ప్రధాని మోదీ దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన మార్పిడి, భిన్నత్వంలో ఏకత్వ భావనలో పెంపొందించే ఏకత భావాన్ని ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 140వ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ ఎర్రం సుమతి, ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### విద్యుదాఘాతంతో హెల్పర్‌కు గాయాలు

ములుగు రూరల్ : విద్యుదాఘాతంతో హెల్పర్‌కు గాయాలైన సంఘటన మండలంలోని మాన్‌సింగ్ తండా శివారులో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రాంచంద్రాపురం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ శాఖలో ప్రైవేట్ హెల్పర్‌గా బానోత్ యాకూబ్ పని చేస్తున్నాడు. మాన్‌సింగ్‌తండా పరిధిలో విద్యుత్ మరమ్మతుల కోసం స్తంభం ఎక్కాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ లైన్‌కు కరెంటు సరఫరా కావడంతో షాక్‌కు గురయ్యాడు. దీంతో యాకూబ్ మెడ, చాతి, పొట్ట భాగంలో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. యాకూబ్ పరిస్థితి విషయంగా ఉందని తెలిపారు.

### ఎడ్లబండిని ఢీకొన్న ఆటో.. పలువురికి గాయాలు

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని పాత్రాపురం గ్రామ సమీపంలో రోడ్డు పక్కన పెట్టిన ఎడ్లబండిని ఆటో ఢీకొనడంతో పలువురికి గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం. మండలంలోని చొక్కాల గ్రామానికి చెందిన 15 మంది కూలీలు ఆటోలో నూరవీడులో మిర్చి ఏరేందుకు వెళ్లారని తెలిపారు. పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో పాత్రాపురంశివారులో రోడ్డు పక్కన పెట్టి ఉన్న ఎడ్లబండిని ఆటో ఢీకొట్టడంతో ఆటో పల్టీకొట్టిందని తెలిపారు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురికి స్వల్ప గాయాలు, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108లో వెంకటాపురం వైద్యశాలకు తరలించారు. తీవ్రగాయాలైన అంగాల సంధ్య, ససుగొండ వెంకటనర్సు, గంపల సుబ్బలక్ష్మి లను మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

# ఉడకని చికెన్ తిని కూలీలకు అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

వాజేడు : సరిగా ఉడకని చికెన్ తినడంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన 12 మంది వలసకూలీలు అస్వస్థతకు గురైన సంఘటన మండలంలోని చింతూరులో చోటు చేసుకుంది. సోమవారం రాత్రి ఈ సంఘటన జరుగగా మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న వైద్య సిబ్బంది హెచ్ఈఓ వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో వైద్య అందించారు. చింతూరుకు చెందిన మిర్చి రైతుకు మిర్చి ఏరడానికి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలసకూలీలు వచ్చి అక్కడే ఉండి పనులను చేసుకుంటున్నారు. తన చేనులో పని చేసే కూలీలకు రైతు చికెన్ కొని ఇచ్చాడు. దానిని పూర్తిగా ఉడికించకుండా తినడంతో 12 మంది కూలీలు అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పేరూరు వైద్యశాల హెచ్ఈఓ. వేణుగోపాల కృష్ణ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అక్కడి వెళ్లి వారిని పరిశీలించారు. ప్రథమ చికిత్స నిర్వహించి అస్వస్థతకు గురైన వారిని పేరూరు ఆస్పత్రికి తరలించారు. అస్వస్థతకు గల కారణాలను తెలుసుకుని వైద్యం అందించారు. కూలీలకు వైద్య పరీక్షలను చేయగా అందులో ఇద్దరికి మలేరియా జ్వరం ఉన్నట్లు నిర్ధారించారు. అస్వస్థతకు గురైన కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఇవ్వడంతో పాటు తగిన సూచనలు చేసి పంపించారు.

# పశువుల వాహనాల పట్టివేత

ములుగు : అక్రమంగా తరలిస్తున్న పశువుల రవాణా వాహనాన్ని ములుగు పోలీసులు మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో పట్టుకున్నారు. ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తున్న క్రమంలో టీఎస్ 25టీ0759 నంబర్ గల గూడ్స్ వాహనంలో 12 ఆవులు, టీఎస్25టీ9402 నంబర్ గల వెహికిల్‌లో మరో ఏడు ఆవులు, ఏడు ఎద్దులను తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వాహనాలతో పాటు పశువుల ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా పశువుల రవాణాకు పాల్పడిన ఐదుగురు వ్యక్తులపై కే సు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పశువులను గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా పశువుల అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు

ఏటూరునాగారం : మత్తు పదార్థాలను విక్రయిస్తే చర్యలు తప్పవని సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. స్థానిక బొడ్రాయి వద్ద కంగన్‌హాల్ షాపు నడుపుతున్న బట్టు సుజాతపై ఫెవికిక్, బోన్‌నోక్స్ చిన్న పిల్లలకు విక్రయిస్తుందని ఆమెపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బోనాఫిక్స్ లాంటి మత్తు పదార్థాలను విక్రయించే వారిపై పోలీస్‌శాఖ దృష్టి సారించి విద్యార్థులు యువత చెడు మార్గాల వైపు ప్రయాణించకుండా ఎప్పటికప్పుడు అడ్డుకట్ట వేస్తూ ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. యువత విద్యార్థులు రహస్య ప్రదేశాల్లో కర్చీఫ్‌లలో బోనోఫిక్స్ వేసి పీల్చడం ద్వారా మత్తు ఎక్కి మత్తులో ఆనందం పొందడం జరుగుతుందని వెల్లడించారు.

## వీఓఏల ముందస్తు అరెస్ట్



మంగపేట: మండలంలోని ఐకేపీ వీఓఏలు సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో నిర్వహించి తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి తరలివెళ్లకుండా పోలీసులు మంగళవారం ఉదయాన్నే ముందస్తుగా అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఐకేపీ వీఓఏల జిల్లా నాయకులు తూళిపాల గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వంపై తమకు విశ్వాసం, నమ్మకం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మంత్రి సీతక్క వీఓఏల వేతనాలు రూ 24 వేలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో వీఓఏలు వసంత, రమేశ్, ఎల్లయ్య, కల్పన, రాధ, జయలక్ష్మి, సంధ్య పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



వెంకటాపురం(ఎం): మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని తహసీల్దార్ గిరిబాబు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని మజీదులో ముస్లింలకు ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరై మాట్లాడారు. ఇఫ్తార్ విందు లాంటి కార్యక్రమాలతో ప్రజల్లో సోదరభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ముస్లింలు ఇస్మాయిల్, కరీం, జాకీర్, వలీపాషా, కాంగ్రెస్ నాయకులు అయిలయ్య, భగవాన్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి కాంగ్రెస్ కృషి

ఏటూరునాగారం: గ్రామాభివృద్ధికి కాంగ్రెస్ కృషి చేస్తోందని మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన సీసీరోడ్ల నిర్మాణం పనులను ఆయన నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి సీతక్క చొరవతో గ్రామంలోని వీధుల్లో పక్కా రోడ్ల నిర్మాణం పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌డీఈ నరేష్, నాయకులు వావిలాల ఎల్లయ్య, ఆయూబ్, ఖలీల్, లాలయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

## పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణించొద్దు

ఏటూరునాగారం : పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులు ప్రయాణించొద్దని స్థానిక ఎస్సై తాజొద్దీన్ అన్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, స్థానిక సీఐ అనుముల శ్రీనివాస్ సూచనల మేరకు మంగళవా రం మండల కేంద్రంలోని చిన్నబోయినపల్లి, హనుమాన్ నాగర్ ప్రాంతాల్లో ఎస్సై ఆధ్వర్యంలో సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనల కు విరుద్ధంగా పరిమితికి మించి వాహనాల్లో వ్యవసాయ కూలీలను ఆటో, మ్యాజిక్, ట్రాలీల్లో తరలి స్తూ ఉండడంతో డ్రైవర్లు, యజమానులు, కూలీ లకు ప్రయాణికులకు ఎస్సై కౌన్సిలింగ్ ఇచ్చారు. అ నంతరం నిబంధలకు విరుద్ధంగా ఉన్న వాహన యజమానులకు జరిమానా విధించారు. డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల్లో పోలీసుల విలేజ్ వాచ్



ప్రజలతో సమావేశమైన పోలీసులు

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజల సమస్యలను గుర్తించడంతో పాటు సమన్వయం చేసేందుకు స్థానిక పోలీసులు విలేజ్ వాచ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లా పోలీసుల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల వద్దకే పోలీసు అనే కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు ఒక కానిస్టేబుల్‌ను నియమించారు. గ్రామాల్లోని సమస్యలను తెలుసుకునేందుకు వాటి పరిష్కారం కోసం ప్రతి రోజు మధ్యాహ్నం సమయంలో రెండు గంటల పాటు గ్రామస్తులతో ఆ గ్రామ కానిస్టేబుల్ సమావేశం ఏర్పాటు చేసేలా షెడ్యూల్ రూపొందించారు. గ్రామాల్లోని ఫిర్యాదుల, కేసుల నమోదు, గ్రామాల్లోని సమస్యలను సమావేశం ద్వారా ప్రజల నుంచి తెలుసుకుని పరిష్కరించేందుకు పోలీసులు కృషి చేస్తున్నారు. గ్రామాల్లో యువత చెడు మార్గం వెళ్లకుండా మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ప్రజలతో సత్సంబంధాలు కూడా మెరుగుపడనున్నాయి. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంపై గ్రామాల్లోని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# పెట్రోల్ బంకులో మోసం

- పెట్రోల్‌కు బదులు నీరు
- గమనించిన వాహన యజమాని
- బయటకు తీయడంతో బయటపడ్డ బాగోతం



సగం నీరు సగం పెట్రోల్‌తో ఉన్న బాటిళ్లను చూపుతున్న సుధాకర్

కన్నాయిగూడెం: ద్విచక్రవాహనంలో పెట్రోల్ పోసుకుందామని బంకుకు వెళ్లిన వ్యక్తికి సగం పెట్రోల్, సగం నీరు పోసిన సంఘటన మండలంలోని ముప్పనపల్లి జీసీసీ పెట్రోల్ బంకులో సోమవారం రాత్రి వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. ముప్పనపల్లికి చెందిన సుధాకర్ తన ద్విచక్రవాహనంలో పెట్రోల్ పోసుకుందామని జీసీసీ పెట్రోల్ బంకుకు సోమవారం రాత్రి వెళ్లి రూ.210 పెట్రోల్ పోసుకొని వచ్చాడు. బంకు నుంచి 100 మీటర్ల దూరంలోకి వెళ్లగానే బైక్ సడన్‌గా ఆగిపోయింది. ఎంత ప్రయత్నం చేసినా స్టార్ట్ కాకపోవడంతో అనుమానం వచ్చి అందులో పోయించిన పెట్రోల్‌ను బయటకు తీశాడు. తీయగా అందులో నుంచి కొంత పెట్రోల్ మరికొంత నీరులాంటి ద్రావణం బయటకు వచ్చింది. అది గమనించిన సుధాకర్ బంకులో ఉన్న వారికి చెప్పగా బంక్‌లో కల్తీ లేదు. మీ బైక్ ట్యాంక్‌లో నీరు ఉండవచ్చు ఎవరికి నీరు రాంది బంకులోంచి మీకు ఎలా వచ్చాయంటూ బుకాయించినట్లు తెలిపారు. ఇది తెలుసుకున్న వాహన యజమానులు పెట్రోల్ బంకులో కల్తీ జరిగిందన్న వార్తతో తమ వాహనాలు పాడవుతాయని లబో దిబో మంటున్నారు. ఇది తెలుసుకున్న మండల వాసులు వాహనాల మైలేజీ కూడా పడిపోతుందని కల్తీ నిజమే అని అనుకుంటున్నారు. కన్నాయిగూడెం మండలం మారుమూల ప్రాంతం కావడంతో ఎవరు గమనించే అవకాశం ఉండదన్నారు. బంక్‌ను నిర్వహించే అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడి ఉంటారని కొందరు బాహాటంగానే అనుకుంటున్నారు. వెంటనే అధికారులు చొరవ తీసుకొని తనిఖీలు చేపట్టాలని కోరుతున్నారు. పెట్రోల్‌లో నీరు కలిసినట్లు నిజమని తేలితే వెంటనే అధికారులపై చర్యతీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

# నల్లబ్యాడ్జీలతో ఆశ కార్యకర్తల నిరసన



నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

వాజేడు : హైదరాబాద్‌లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జీ చేసి అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు కొప్పుల రఘుపతిరావు మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందు కనీస వేతనాలను పెంచుతామని నమ్మబలికిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మర్చిపోవడాన్ని తప్పుబట్టారు. శాంతి యుతంగా ఆందోళన చేస్తున్న వారిపై లాఠీచార్జీ, అరెస్టు చేయడం, ఆందోళన కోసం వెళ్తున్న వారిని మహిళలు అని చూడకుండా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. నిరసన తెలిపిన వారిలో శాంతకుమారి, దేవి, వసంతలక్ష్మి, నారాయణమ్మ, మాలతి, రంభ, శివకుమారి, అరుణ, మానస, ముత్తమ్మ, అక్కెమ్మ తదితరులున్నారు.

# బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు



గోవిందరావుపేట : పాపయ్యపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు తప్పవని పస్రా ఎస్సై కమలాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని పాపయ్యపల్లిలో గ్రామస్తులతో మాట్లాడారు. బెట్టింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ బెట్టింగుల్లో లక్షల రూపాయలు పోగొట్టుకొని యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గమనిస్తూ ఉండాలని సూచించారు. యువతకు అవసరాలకు మించి డబ్బులను ఇవ్వకూడదని అన్నారు. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే 100 నంబర్‌కు సమాచారం అందించాలని అన్నారు. మొబైల్ ఫోన్లలో బెట్టింగ్ యాప్‌లు ఉన్న, బెట్టింగ్‌లకు పాల్పడిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెట్టింగ్‌లకు పాల్పడే వారి సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. సమాచారం అందించిన వారికి పారితోషికం అందిస్తామని ఎస్సై తెలి పారు.

కన్నాయిగూడెం: సులువుగా డబ్బులను సంపాదించవచ్చనే భావనతో బెట్టింగ్ యాప్‌లకు మొగ్గు చూపి ప్రాణాలు పోగొట్టుకోవద్దని స్థానిక ఎస్సై ఇనిగాల వెంకటేశ్ అన్నారు. వాటిపై యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ క్రమంలో ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌లతో బెట్టింగ్‌లు విపరీతంగా జరిగే సమాచారం ఉన్నందున ఈ లావాదేవీలు ఫోన్‌పే, గూగుల్ పే వంటి యాప్‌ల నుంచి బెట్టింగ్ యాప్‌లకు చేరే అవకాశం ఉందన్నారు. ఎన్నో కుటుంబాలు బెట్టింగ్ యాప్‌ల బారిన పడి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు.

# వేసవిలో జాగ్రత్తలు పాటించాలి



ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఎస్ఎస్‌తాడ్వాయి : వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకు అధికం అవుతున్నాయని ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి అడెపు చిరంజీవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రయాణికులకు, కూలీలకు బాటసారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఇంట్లో ఉన్నా, బయటకు వెళ్లిన తగిన జాగ్రతలు తీసుకోవాలన్నారు. లేదంటే ఆరోగ్య పరమైన ఇబ్బందులు బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. శరీరం నుంచి చెమట రూపంలో కోల్పోయిన లవణాలను తిరిగి పొందేందుకు మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీళ్లు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బకు గురైతే వెంటనే అందుబాటులో ఉన్న పీహెచ్‌సీలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ సంజీవరావు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.